క్లుప్తంగా

ఈద్గాలో ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎర్రకోట జగన్, కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: రంజాన్ పండుగ పురస్కరించుకొని ముస్లింలు చేపట్టే ప్రత్యేక నమాజ్ కోసం స్థానిక కమిటీ రోడ్డులో గల ఈద్గాలో ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈద్గాతో పాటు పరిసరాల్లో పారిశుధ్య పనులతో పాటు మంచినీటి ఏర్పాటు తదితర సౌకర్యాలను సమకూర్చాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు ఖాశిబేగ్, తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి



కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఏపీడీ అల్లీపీరా

గోనెగండ్ల: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులు చేసుకోవాలని ఏపీడీ అల్లీపీరా సూచించారు. స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలోని చాకిరేవులో పూడికతీత పనులను బుధవారం ఏపీడీ అల్లీపీరా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కొలతల ప్రకారం పనులు చేసుకుంటే రోజుకు రూ.272 కూలి అందుతుందని తెలిపారు. ఉదయం 7 గంటలకు వెళ్లి 11 గంటల లోపు ఇంటికి వెళ్లిపోయేలా పనులు చేసుకోవాలన్నారు. కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈసీ ఉస్మాన్ బాషా, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు మల్లికార్జున, సలాం తదితరులు ఉన్నారు.

లైన్‌మెన్ హఠాన్మరణం



మహానంది (ఫైల్)

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న మహానంది (45) బుధవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందినట్లు ఏఈ మల్లికార్జున తెలిపారు. లైన్‌మెన్ మహానంది బుధవారం బిల్లేకల్లులో విధులకు హాజరై పని నిమిత్తం ఆలూరుకు వచ్చారు. సబ్‌స్టేషన్‌లో ఉండగా గుండెల్లో నొప్పి ఉందని సిబ్బందికి చెప్పడంతో వారు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లైన్‌మెన్ మృతి చెందారు. లైన్‌మెన్ మహానంది స్వగ్రామం ఆస్పరి మండలం హలిగేర. ఈయన భార్య అరుణమ్మ మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. ముగ్గురు చదువుకుంటున్నారు. మూడు నెలల వ్యవధిలోనే తల్లి, తండ్రి మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. లైన్‌మెన్ మృతి పట్ల ఏడీ నాగేంద్రప్రసాద్, ఏఈ మల్లికార్జున, సర్పంచ్ లింగమ్మ సంతాపం తెలిపారు.

రీసర్వే హద్దు రాళ్ల ఏర్పాటు

నందవరం: జగనన్న భూహక్కు- భూరక్ష సర్వేలో భాగంగా పూలచింత గ్రామంలో సమగ్ర సర్వే పూర్తి కావడంతో అధికారులు భూమి హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం హద్దు రాళ్ల ఏర్పాటును తహసీల్దార్ నిత్యానందరాజు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. భూ వివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే చేస్తోందన్నారు. సర్వే పక్కాగా చేపట్టి భూమి హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో సమగ్ర భూ సర్వే మిట్టసోమపుం, పూలచింత, మాచాపురం, ఇబ్రహీంపురం గ్రామాలలో పూర్తి చేసినట్లు తెలిపారు. 4 గ్రామాలకు సంబంధించి 7,854 ఏకరాలలో భూ సర్వే పూర్తి చేసి రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. సర్వేలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. మండల సర్వేయర్ అబ్బాస్‌బాషా, గ్రామ సర్వేయర్లు ముగతి శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో 'జీజీఎంపీ'

తుగ్గలి: మండల పరిధిలోని రోళ్లపాడు, రోళ్లపాడుతండా, ఎల్లమ్మగుట్ట తండాలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్ తెలిపారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరై సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

చిప్పగిరి: స్థానిక కస్తూర్బా పాఠశాలను బుధవారం జీసీడీఓ వేదవతి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం, విద్యాబోధన, వసతి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టాక్ రూంను తనిఖీ చేశారు. పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఎంఐసీ కో-ఆర్డినేటర్ మారుతి, ఎస్‌ఓ శబాన, సిబ్బంది ఉన్నారు.

ఆర్బీకేల సేవలు విస్తృతం

- వీఏఏలకు అనుబంధంగా రైతు మిత్రల నియామకం
- వీఏఏలు క్షేత్రస్థాయికి వెళ్లి పంటలు పరిశీలించేలా అదనపు బాధ్యతలు
- రైతుల మరింత చేరువ కానున్న సేవలు
- ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో 76 ఆర్బీకేలు



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏలు (ఫైల్)

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్బీకే) అన్నదాతలకు విశేష సేవలు అందుతున్నాయి. గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ) క్షేత్రస్థాయిలో పంటల సాగులో రైతులకు అవసరమైన సేవలందిస్తుండగా ప్రభుత్వం ఈ సేవలు మరింత విస్తృతం చేసేలా వీఏఏలకు సపోర్టుగా ఆర్బీకే మిత్రలను నియమించింది. వీరిద్దరూ సమన్వయంతో పనిచేస్తూ ఆర్బీకేల్లో, క్షేత్రస్థాయిలో రైతులకు సేవలందించనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసింది. రైతుల కోసం గ్రామాల్లో ఆర్బీకేలు ఏర్పాటు చేసి పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేస్తోంది. అలాగే వైఎస్సార్ రైతు భరోసా, పంటల బీమా తదితర పథకాలు అమలు చేస్తూ అండగా నిలుస్తోంది. అంతేకాకుండా ఆర్బీకేల్లో నియమించిన గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ) క్షేత్రస్థాయిలో రైతుల పొలాల్లోకి వెళ్లి పంటల సాగులో సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఈ సేవలు మరింత విస్తృతం చేస్తూ ప్రభుత్వం కొత్తగా ఆర్బీకే మిత్రల నియామకం చేపట్టింది. వీరు ఆర్బీకేల్లో రైతులకు సేవలందించనున్నారు. వీఏఏలు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ పంటలను ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన సూచనలిస్తారు.

వీఏఏలకు ప్రత్యేక బాధ్యతలు

ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఉన్న ఆర్బీకేల్లో వీఏఏలు రైతులకు సేవలందిస్తున్నారు. అలాగే రైతుల పొలాల్లోకి వెళ్లి పంటల సాగులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? తగిన మోతాదులో మందులు పిచికారీ చేస్తున్నారా? పంటల పెరుగుదలలో సమస్యలు ఉన్నాయా? తదితర అంశాలు గుర్తించే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇకపై వీరు స్థానికంగా ఉన్న రైతు పొలాల్లోకి వెళ్లి పంటలను పరిశీలించి ఏదైనా సమస్య ఉంటే ఏ మందులు వాడాలో తెలియజేసేలా ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. అలాగే సాగులో ఉన్న పంటల సమస్యలు ఉంటే ఆ వివరాలను అటు వ్యవసాయ అధికారులకు, ఇటు శాస్త్రవేత్తలకు తెలియజేస్తారు. సమస్య ఎక్కువ ఉంటే నేరుగా శాస్త్రవేత్తలే పొలంలోకి వెళ్లి ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరిస్తారు.

ఆర్బీకే మిత్రల నియామకం

రైతు భరోసా కేంద్రాల్లో సేవలందించేందుకు వీఏఏలకు సపోర్టుగా కొత్తగా ఆర్బీకే మిత్రలను ప్రభుత్వం నియమించింది. వీరు వీఏఏలు లేని సమయంలో రైతులు ఆర్బీకేలకు వచ్చినప్పుడు వారికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను అందించడంతో పాటు వివరాలు నమోదు చేసుకుంటారు. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని 5 మండలాల్లో 76 ఆర్బీకేలు ఉన్నాయి. ఒక్కో ఆర్బీకేకు ఒక మిత్రను నియమిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

ఆర్బీకేల ద్వారా మిత్ర సేవలు



ఆర్బీకేల్లోని వీఏఏలు రైతుల పొలాలకు క్షేత్రస్థాయిలో వెళ్లి పంటలు పరిశీలించేలా ప్రత్యేక బాధ్యతలు అప్పగించాం. ఆర్బీకేల్లో సేవలు మరింత విస్తృతం చేయడంతో పాటు కేంద్రంలో అందుబాటులో ఉండి రైతులకు సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆర్బీకే మిత్రలను నియమిస్తోంది. వీరు రోజు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటారు.

– సునీత, ఏడీఏ, ఆలూరు

ఘనంగా పెద్దమ్మవ్వ దేవర

ఆస్పరి: మండలంలోని జోహరాపురం గ్రామంలో వెలసిన పెద్దమ్మవ్వ ఊరి దేవర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి గంగ, ఆకు పూజ, కుంకుమార్చన, మంగహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు కుంభాలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణస్వామి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సర్పంచ్ నెల్లూరప్ప, ఎంపీటీసీ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

14న రక్తదానం శిబిరం

మద్దికెర: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 14న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాఘవేంద్ర బుధవారం తెలిపారు. అలాగే చలివేంద్రం ఏర్పాటు తదితర కార్యక్రమాలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి

తుగ్గలి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉందని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సాలమ్మ తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ బైపీసీలో 40 సీట్లు, 9వ తరగతిలో 2, 8వ తరగతిలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అడిగిన వారందరికీ పనులు కల్పిస్తాం



అమకతాడు సమీపంలో చెక్‌డ్యాం పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కృష్ణగిరి: జిల్లావ్యాప్తంగా వేసవిలో లక్షన్నర మందికి ఉపాధి పనులు కల్పించేలా లక్ష్యంగా పెట్టుకున్నామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. కృష్ణగిరి మండల పరిధిలోని అమకతాడు గ్రామ సమీపంలో బుధవారం చెక్‌డ్యాంలో పూడికతీత పనులను, ఉపాధి పథకం కింద సాగుచేసిన పండ్ల మొక్కలను ఆయన పరిశీలించి అనంతరం కూలీలతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా రోజుకు 90 వేల మంది పనులకు వస్తున్నారని ఈ నెల చివరికల్లా దీన్ని లక్షన్నరకు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎండలు అధికంగా ఉండటంతో ఉదయం త్వరగా వచ్చి పనులు చేసుకోవాలని, పని ప్రదేశంలో నీడ, తాగునీరు, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం కృష్ణగిరి ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో 6 వేల మంది కూలీలు పనులకు రావాల్సి ఉండగా 4 వేల మంది మాత్రమే వస్తున్నారని కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి మాట్లాడుతూ సామాజిక తనిఖీల్లో గుర్తించిన అవకతవకలకు సంబంధించి వంద శాతం సొమ్మును రికవరీ చేయాలని సూచించారు. అసిస్టెంట్ డీవీఓ పక్కీరప్ప, ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ చెన్నకేశవులు, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్ ఉన్నారు.

వైభవంగా రథోత్సవం



శంకరబండలో లింగమేశ్వర స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరిలో ఆంజినేయ స్వామి, శంకరబండలో లింగమేశ్వర స్వామి రథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయాల్లో స్వామి వారికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కుంభోత్సవం, నందికోలు సేవతో స్వాముల వారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి ఆంజనేయస్వామి, లింగమేశ్వర నామస్మరణంతో గ్రామాల చివరకు లాగారు. అక్కడ పూజలు నిర్వహించి తిరిగి ఆలయాలకు చేర్చారు. భక్తులు పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. సర్పంచులు విజయలక్ష్మి, వెంకటేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

చిప్పగిరి: హాలహర్వి మండలం విరుపాపురం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి రూ.20 వేలు విరాళం అందించి దాతృత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా విగ్రహ ఏర్పాటు కమిటీ నాయకులు జెడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రామాంజినేయులు, ఎల్లప్ప, మల్లికార్జున, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడీ విచారణ

ఆలూరు: డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రి చర్యలపై బుధవారం ఆర్జేడీ నాగలింగారెడ్డి, హాలహర్వి తహసీల్దార్ మల్లికార్జున స్వామి, ప్రస్తుత ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మాధురి, ఆలూరు ఎంఈఓ కోమలాదేవి, విద్యార్థి సంఘం నాయకులు మైనా తదితరులు విచారణ చేపట్టారు. సదరు ప్రిన్సిపాల్ తన కార్యాలయంలోని దేశ నాయకుల చిత్రపటాలను తొలగించారని సాటి అధ్యాపకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. వారి ఆదేశాల మేరకు గత నెల 29న ప్రిన్సిపాల్ సింహాద్రిని సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో బుధవారం ప్రిన్సిపాల్ సింహాద్రిని పిలిపించి విచారణ చేపట్టారు. అనంతరం ఆర్‌జేడీ నాగలింగారెడ్డి మాట్లాడుతూ.. విచారణ నివేదికను రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ అధికారులకు అందజేస్తామన్నారు.

ఎస్ఐ బదిలీ

మద్దికెర: మద్దికెర పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగేంద్రప్రసాద్ నంద్యాల జిల్లా మహానందికి బదిలీ అయినట్లు పోలీసులు తెలిపారు. అయితే మద్దికెర పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా ఇంకా ఎవరిని నియమించలేదని వారు తెలిపారు.



చీరలే పైరుకు రక్ష

మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన రాజు అనే రైతు టమాట పంట చేతికొచ్చే సమయంలో కాయలు కుళ్లిపోతుండడంతో వినూత్నంగా ఆలోచించాడు. ఎండలు తీవ్రం కావడంతోనే కాయలు దెబ్బతింటున్నట్లు గుర్తించి పొలంలో కర్రలు పాతి పైరుకు నీడపడేటట్లు పాత చీరలు కట్టాడు. పంటను కాపాడుకునేందుకు తనకు తోచిన విధంగా కృషి చేస్తున్నాడు.

– మద్దికెర

ఆనందాల చి'గురు'

ఎమ్మిగనూరుటౌన్: దాదాపు రెండు దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. ఆవిరైన ఆశలు ఆనందాలై చిగురించాయి. గురువు కావాలనే చిరకాల కోరికైన 1998 డీఎస్సీ అభ్యర్థుల కల నెరవేరింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి భవితకు వెలుగు బాట చూపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4100 మంది అర్హులైన వారిలో 1998 మంది అభ్యర్థులకు బుధవారం విద్యాశాఖ కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చింది. జిల్లా కేంద్రంలో జరిగిన కౌన్సిలింగ్‌లో నియోజకవర్గంలో దాదాపు 15 మందికి ఉపాధ్యాయ పోస్టింగ్‌లు వచ్చాయి. దీంతో పోస్టింగ్‌లు తీసుకున్న అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగనన్న.. మా ఆనందాల చిగురువు నీవని అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



1998 డీఎస్సీలో క్వాలిఫై అయ్యాను. అప్పట్లో పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ వచ్చా. ఇక ఉపాధ్యాయ ఉద్యోగం రాదనుకున్నా. నా కుమారుడికి 2014లో ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది. అయితే సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీతో ప్రస్తుతం నాకు ఉద్యోగం వచ్చింది. అది కూడా ఎమ్మిగనూరు మండలం పరమాన్‌దొడ్డి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను కౌన్సెలింగ్ ద్వారా ఎంపిక చేసుకోవడం సంతోషంగా ఉంది. సంతోషంగా ఉద్యోగం చేస్తా.

– జిక్రియ, ఎమ్మిగనూరు

జగనన్న పాలనకే జనం మద్దతు



పత్తికొండలోని కల్లుపెంట వీధిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా బుధవారం పత్తికొండలోని శ్రీరాములపేట కాలనీ, కల్లుపెంట వీధిలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పర్యటించారు. గడప గడపలోనూ ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం లభించింది. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాలను వివరించారు. మనందరి భవిష్యత్ బాగుండాలంటే మళ్లీ జగనన్ననే సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు జల్లా సోమశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే తమ కుటుంబాలు సంతోషంగా ఉన్నాయని, సీఎం జగనన్నకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని లబ్ధిదారులు చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 34వ వార్డులో పలు చేనేత కుటుంబాల ఇళ్లను ఆయన సందర్శించి ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయం నమోదు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాథ్ రమేష్, పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రం నందవరంతో పాటు నదికైరవాడి, ధర్మపురం, హాలహర్వి, చిన్నకొత్తిలి, బాపురం తదితర గ్రామాల్లో ఎంపీటీసీలు, పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రస్తుతం వైఎస్సార్ ప్రభుత్వం పాలనకు, గత టీడీపీ పాలనకు వ్యత్యాసాలను వివరిస్తూ, టోల్ ఫ్రీ 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని వినిపించారు. అనంతరం ఇంటి గుమ్మాలకు స్టిక్కర్లను అతికించారు.

తుగ్గలి: మండల పరిధిలోని పీ.కొత్తూరులో బుధవారం సాయంత్రం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ హనుమంతు, ఉప సర్పంచ్ మధుసూదనరెడ్డి, దేవేంద్ర, లాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: సంక్షేమ క్యాలెండర్ ప్రకారం పథకాలను అందిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్తు' అని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ లక్ష్మికాంతరెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంకటేష్, జయరామిరెడ్డి, బాలు, వెంకటేశ్వరరెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని ఆలంకొండ, చుంచుఎర్రగుడి తదితర గ్రామాల్లో బుధవారం ఆయా గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకుల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించి ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.

గోనెగండ్ల: నవరత్నాలతో ప్రతి ఇంట్లో వెలుగులు నిండాయని ఎంపీపీ టీ.నసురుద్దీన్ అన్నారు. బుధవారం గోనెగండ్లతో పాటు గంజిహళ్లి, అలువాల, పెద్దనేలటూర్, తిప్పనూరు, పెద్దమరివీడు తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గత టీడీపీ, ప్రస్తుత ప్రభుత్వ పాలనలో తేడాలను వివరించి సీఎం జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, బసినేపల్లి గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మార్కెట్‌యార్డు డైరెక్టర్ భద్రయ్య, సచివాలయ కన్వీనర్ కవిదాసు మద్దికెర, బసినేపల్లి గ్రామాల్లో పర్యటించారు.ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించి సంక్షేమ పథకాల గురించి వివరించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఆలూరు జామియా మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన దృశ్యం

ఆలూరు: ముస్లింలు పవిత్రంగా నెల రోజులపాటు ఉపవాస దీక్షలు కొనసాగించి అల్లాను ప్రార్థించడం ద్వారా మంచి జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్ అన్నారు. కర్నూలు-బళ్లారి రోడ్డు సమీపంలోని జామియా మసీదులో బుధవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పలువురు ముస్లింలు హాజరై విందు స్వీకరించారు. వైస్ ఎంపీపీ నాగవేణి, మండల కోఆప్షన్ మెంబర్ బాషా, జీరాగౌడు, ఎంపీటీసీ సభ్యులు జీరా నాగమ్మ, ఎల్లమ్మ, పాల్గొన్నారు. మసీదు పెద్దలు జెడ్పీటీసీ శేఖర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

వెల్దుర్తి: రంజాన్ నెల బుధవారం నాటి ఉపవాస దీక్షను విరమించిన ముస్లిం సోదరులకు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానిక జామియా మసీదులో జరిగిన కార్యక్రమంలో ముందుగా ముస్లింలతో కలిసి దువాలో పాల్గొన్నారు. ముస్లింలు ఎస్ఐను శాలువాతో సన్మానించారు. అనంతరం దీక్ష విరమణకు పూనుకున్న ముస్లింలకు ఎస్ఐ స్వయంగా వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. మసీదు కమిటీ ప్రతినిధులు, పెద్దలు అబుల్లా హఫీజ్, నాయుకలు గట్టు ఆరిఫ్, ఇదుర్‌బాష, షాలుమియ్య, ఏఎస్ఐ, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

వెల్దుర్తి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు పల్లెపల్లెనా ప్రచారం నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ తెలిపారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం, సీపీఐ ప్రతినిధులతో ఆయన ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా అనుసరించాల్సిన పద్ధతులపై సమీక్షించారు. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి నుంచి గ్రామగ్రామాన తిరుగుతూ కేంద్రం దుర్మార్గపు పాలనను ప్రజలకు వివరిస్తామని, వామపక్షాల కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం, సీపీఐ, అనుబంధ సంఘాల ప్రతినిధులు నగేశ్, టి.కృష్ణ, మారెన్న, రాజు, మాధవస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ లబ్ధి



కదమకుంట్లలో బుక్‌లెట్ అందజేసి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం సాయంత్రం కడమకుంట్ల, ఉసేనాపురంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో కుటుంబానికి ఎన్ని సంక్షేమ పథకాల ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ఆదేశం

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీదేవి ఆదేశించారు. పింఛన్లు, ఇంటి పట్టాలు, పక్కా గృహాలు తదితర సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ పులికొండ నాయక్, నాయకులు రామచంద్రారెడ్డి, జగన్నాథరెడ్డి, నాగేష్, హుసేన్, హనుమంతు, అమరనాథరెడ్డి, హనుమంతరెడ్డి, మోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, చాంద్‌బాషా, రామాంజినేయులు, ఎంపీటీసీ ఆదిలక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం జరిగింది. బుధవారం రాత్రి రూరల్ ఎస్ఐ పి.నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన బోయ నరేంద్ర ఓ మైనర్ బాలికను చెయ్యి పట్టుకొని గుడిసెలోకి లాక్కెళ్లి బలాత్కారం చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. బాలిక కేకలు వేయటంతో పారిపోయినట్లు చెప్పారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు పోరాడుతాం

కృష్ణగిరి: ఎస్సీ వర్గీకరణ కోసం 29 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పోరాటాలు చేస్తున్నామని మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కన్వీనర్ గుండాల ఈశ్వరయ్య మాదిగ తెలిపారు. కృష్ణగిరిలో బుధవారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణ సాధనే తమ ధ్యేయం అని అందుకోసం పోరాటాలకు సిద్ధం అవుతున్నామన్నారు. నాయకులు పులి కేశవయ్య, శ్రీరాములు, పెద్దయ్య తదితరులు ఉన్నారు.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు

హొళగుంద: స్థానిక ఎస్సీ కాలనిలో సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ ఆధ్వర్యంలో మండల పరిషత్ అభివృద్ధి నిధులతో జరుగుతున్న ఈ పనులను కాలనీలోని ప్రధాన దారి నుంచి 200 మీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశా తెలిపారు. అలాగే రోడ్లు దాటేందుకుగాను 10 వరకు సిమెంట్ పైపులు వేస్తామన్నారు.

అనుమతుల్లేకుండా అడ్మిషన్లు

ఎమ్మిగనూరుటౌన్: విద్యా సంవత్సరం ముగియక మునుపే విద్యాశాఖ అనుమతి లేకుండా అడ్మిషన్లు ప్రారంభించిన కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు విజయేంద్ర, ఖాదర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఏజాజ్‌అహమ్మద్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ అడ్మిషన్లను నిలిపి వేయాలని కోరారు.

తక్కువ ఎత్తులో విమానం చక్కర్లు



హొళగుంద: మండల కేంద్రం మీదుగా విమానం గత వారం రోజులుగా చక్కర్లు కొడుతోంది. తక్కువ ఎత్తులో విమానం వెళుతుండడంతో చూసేందుకు పిల్లలు ఎగబడ్తున్నారు. 10 లోపు సీట్లున్న ఈ విమానం ఉత్తరం వైపున్న పెద్ద కొండ పక్క నుంచి దక్షిణ వైపున్న కర్ణాటక సరిహద్దు వరకు తిరుగుతుంది. రోజుకు పలుమార్లు చక్కర్లు కొడ్తుండడంతో జనం పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. ఏరియల్ సర్వే నిమిత్తం తేలికపాటి విమానం తిరుగుతున్నట్లు తెలుస్తోందని ఎస్ఐ అబ్దుల్‌జహీర్ పేర్కొన్నారు.